# అంటరానివాళ్లా?

—————:o:—————

హేయమును, ఘోరమును, పాపభూయిష్ఠమును అగు అస్పృశ్యతాదోషమును గూర్చి దేశనాయకుల, మతగురువుల యభిప్రాయములను వినెదరా?

హిందూసంఘమును బట్టి పీడించుచున్న యీరోగమును గూర్చి శ్రీవివేకానందస్వామివారు ఏమిచెప్పియున్నారు? "మన బ్రతుకెంత నవ్వులపాలైనది? ఒకమాదిగవాడు మనహిందూమతమందుండి మనదగ్గరకు వచ్చినపుడు వానిని బొబ్బలరోగమువలె చూచి భయపడి దూరదూరమునకు పోవుదుము. కాని పాదిరీదొరగారు కొంచెము నీళ్లను నెత్తిమీదచల్లి యేదియో ప్రార్థనను గొణగినతరువాత ఆ మాదిగవాడే చీలికలచొక్కా నొకదానిని తొడుగుకొని అతిపూర్వాచారపరాయణుడగు హిందువుని యింటిలోనికి వచ్చినపుడు వానికి కుర్చీ నిచ్చి యుచితమర్యాదలను చేయని హిందువుండడని నేను గట్టిగా చెప్పగలను. ఇతకన్నను నగుబాటు వేరొకటుండదు.

భూతదయనుగురించి హిందూమతమునుమించి బోధించుమతము మరియొకటిలేదు. బీదలగొంతుపైనను, నిమ్నజాతులగొంతుపైనను కాలువేసి త్రొక్కుటకు గూడ హిందూమతమును మించినమతము మరియొకటిలేదు. ఈలోపము మతములో లేదని భగవంతుడు నాకు తెలిపినాడు. మతలోపముకాదుగాని హిందూమతము నవలంబించు దొంగభక్తులలోపము; భక్తియననేమో, కరుణయననేమో యెరుగని నిష్ఠపరులలోపము; పారమార్థిక, వ్యావహారిక సంబంధములగు కఠినసిద్ధాంతములను బోధించు వంచకులలోపము."

పంచములస్థితిని గూర్చి కరవీరపీఠాధిపతులగు జగద్గురు శంకరాచార్యులవారు ఏమివాక్రుచ్చియున్నారు? "ఆత్మోపలబ్ధికి ప్రయత్నిం

చని లౌకికుడు మతాంతరులగు మునల్మానులను, క్రైస్తవులను ప్రేమించి, గౌరవించి హిందువులగు పంచములకు దూరముగాపోయి హేయముగా జూచుచుండుటచే ఘోరపాపము జేయుచున్నాడని నాయభిప్రాయము. ఉత్తమమగుపరిశుద్ధత నిఖిలభూతములను ప్రేమించుటవలన కలుగునని మరువరాదు. ఇప్పటికైనను అగ్రజాతిహిందువులు, పంచములు తమసోదరులని గ్రహించుట అవసరము."

గీతారహస్యగ్రంథకర్తయు, తత్త్వవేత్తయు అసమానపండితుడును, రాజకీయవ్యవహారధురంధరుడును అగులోకమాన్య బాలగంగాధరతిలక్ మహారాజుమాటలనువినెదరా? "1894 సం॥ గణపతియుత్సవములో మాదిగవాడొకడు తనగణపతివిగ్రహము తీసికొనివచ్చెను. వానిని యుత్సవములో యెవ్వరును చేరనియ్యలేదు. అతడు నాతో వచ్చి చెప్పుకొనెను. నేను నాగణపతినిపెట్టుకొన్న బండిలో పెట్టుకొమనిచెప్పి పెట్టించితిని......భగవంతునికి యెవడు అంటరానివాడు కాడో వానినిమనముచూపి, ఇదుగో! ఇతడు అంటరానివాడు అనుట భగవంతునియెడ అపచారముచేయుట."

దేశబంధు లాలాలజపతిరాయిగారు పంచమసమస్యనుగూర్చి ఏమిచెప్పిరో తిలకించెదరా?

"నీవు కేకలువెయ్యి, బొబ్బలుపెట్టు, రొదచేయి, గందరగోళముచేయి, యేమైనాఅను, సంఘములోని అన్నికులముల జనులు సమర్థులగునంతవరకు జాతియేర్పడదు. మనకు ఒకజాతిగా నిర్మింపబడుటకు కావలసినసమరత నిమ్నజాతు లనిపిలువబడువారి సాయము లేనిదే సమకూరదు. వారు యిప్పుడున్నస్థితిలో నున్నంతమట్టుకు దేశములో ఐకమత్యముండదు. ఏకీభావము కుదరదు. నిమ్నజాతులు పైకి వచ్చి వారియుచితస్థాన మాక్రమించునంతవరకు నిజముగా మన మొకజాతియని అనుకొనుటకు వీలులేదు. ఇప్పుడు వారికి ఒకస్థానములేదు."

బరోడామహారాజుగారొకచో వారినిగురించి యిట్లుచెప్పియుండిరి. "అసలు ఈఅంటరానితనంమేమిటి? విచిత్రమగు యీయాచారము ఒక్క హిందూ దేశములో మాత్రము కనబడుచున్నది. ఇతరదేశములవారికి దీనిఅర్థము బోధపడదు. ఈఆచారము బహుశ జపానుదేశములోకూడ యిదివరకున్నట్లుతోస్తుంది. కాని జపానుదేశాభివృద్ధికి భంగకరములు, ఆటంకములునగు పిచ్చియాచారములను, నమ్మకములను ఒక్కమాటు విదలించిపారవేసినది. ఆసమయములోనే ఈయంటగానితనాన్నికూడా పాతమార్చినది."

ఋషితుల్యుడగు గాంధిమహాత్ముని మొరవినెదరా? "పంచములు—అంటరానివారు—చెప్పరానివారు—పెద్దయింటివారు అని పిలువబడి నిరాదరింపబడుచున్న వారి నీచులబాధపెట్టుట హిందూమత ధర్మములలో నొక్కటియని ధ్రువపడుటయే ప్రాప్తించెనేని నేను హిందూమతమునకు ప్రబలవిరోధినని బహిరంగముగ చాటుకొనుటకు గూడ సంసిద్ధుడనైయున్నాను. కాని నేనింతవరకు హిందూమతమింతటి కఠినధర్మముల కాకరమైనదని నమ్ముటకవకాశము కలుగలేదు."

రెవరెండు హాలండ్ గారు హిందూ దేశము మొత్తముమీద నెలకు పదివేలమంది క్రైస్తవులగుచున్నారని వ్రాసియున్నారు. క్రైస్తవమతము నందుండెడి ఆత్మానురాగముచేత మనఃపూర్వకముగ క్రైస్తవులగువారిమాట యటుండనిండు. తాము పుట్టిన హిందూసంఘమే తమ్ముపురుగులవలె జూచుటచేతను, తమ ఆర్థిక, నైతిక, ఆధ్యాత్మికాభివృద్ధికి కావలసిన యుపకరణములు కేవలము కుక్షింభరులగు పై జాతులవారిచే కల్పింపబడకపోవుటచేతను, ఈశ్వరుడిచ్చిన ప్రాణమును కాపాడుకొనుటకు కావలసినగాలి, నీరు, ఆహారమునకు గూడ ఈహిందూసంఘములో ఆదీనులు పెట్టిపుట్టకపోవుటచేతను, తమమతవిశ్వాసము కొరకై ప్రాణములపోగొట్టుకొనునంతటిశక్తి చాలక, వీరుక్రైస్తవుల

యందచేరుచున్నారు. చాలమంది తమమతవిశ్వాసముకొఱకు పోవుట లేదు. పొట్టకూటికై తమ హిందూ "సోదరులు" తమ్ముపెట్టు ఘోరహింసనుండి తప్పించుకొనుటకై స్వమతమును గూడ త్యజించిపోవుచున్నారు. క్రైస్తవమతమునందు యథార్థవిశ్వాసము లేదు. హిందూ సాంప్రదాయములయందు వారికున్నవిశ్వాసము "అగ్ర" జాతులవారిచే చంపబడినది. మేము హిందువులమని చెప్పుకొనువారికి వారిసంఘము మీదను ధర్మముమీదను యేమైన అభిమానమున్నచో దీనికి జవాబేమిచెప్పగలరు ? సిగ్గుపడవలసినదేనా ?

వాల్మీకివంశజుల నిట్టిదుస్థితిలోనుంచుట న్యాయమా ? కుక్కలకన్న, పిల్లులకన్న వీరిని నీచముగా జూచుటధర్మమా ? మీహృదయము లెక్కడ ? తోడిమానవుల నిట్లు నిరసించెదరా ? వీరిదుస్థితికి విలపింపనివారి నేమనవలెను ? వీరికి చేయూతనీయకుండుట మహాపాతకముకాదా? నరహత్యలకన్న, శిశుహత్యలకన్న, స్త్రీహత్యలకన్న ఘోరపాపమిదియని గుర్తింపుడు. ఆఫ్రికా, అమెరికాలలో తెల్లవారు మిమ్ముపెట్టుబాధలకు పెద్దగగ్గోలుచేయుచున్నారే ! మనదేశములోపుట్టి, మనకు అన్నిపంటలుపండించి, మనలరక్షించి, పోషించు యీ దీనులనిట్లు నిరసించుట ప్రకృతివిరుద్ధముకాదా ? వీరిని బానిసలుగా జూచునంతకాలము మీరెల్లరు బానిసలైయుందురని త్రికరణశుద్ధిగా నమ్ముడు.

నిమ్నజాత్యుద్ధరణసంఘము
రాజమహేంద్రవరము
19—1—1922

పాలకోడేటి గురుమూర్తి.
తల్లాప్రగడ ప్రకాశరాయుడు.

---

శ్రీవిద్యానిలయ ముద్రాక్షరశాల:—రాజమండ్రి, 1922.